# అది అంటే ఇది

### పి. రవికుమార్

ప్రేమించిన ఆదిలక్ష్మినే పెద్దల ఆశీర్వాదంతో పెళ్లాడాడు గోపాలం. అందుచేతే అతనిలో కొంచెం ఆనందం, గర్వం చోటుచేసుకున్నాయి.

ఆరోజే అతని శోభనం రాత్రి.

అదీ అతని అసలు ఆనందానికి కారణం. పెళ్లైన దగ్గర్నుంచి ఆమె తనదే. అయితే పూర్తిగా కాలేదు. పాపం కుర్రాడి బాధ చూడలేక ఆ ముచ్చట తీర్చితే తమ బాధ్యతా తీరుతుంది, వాళ్ల ఆరాటం తగ్గుతుందని, ముహూర్తం నిర్ణయించారు పెద్దలు.

పెళ్లికి ముందు ఎన్నో కబుర్లు చెప్పుకొన్నారు. చెట్టాపట్టాలేసుకు తిరిగారు. అదేమి చిత్రమో పెళ్లైన దగ్గర్నుంచి ఆదిలక్ష్మి తప్పించుకు తిరుగుతోంది. గోపాలానికి ఎన్నో కబుర్లు చెప్పాలని ఉన్నా, వీలుకాక గుటకలు మింగి ఊరుకున్నాడు. అయితే అతని ప్రతి చర్య ఆమె గమనిస్తూనే ఉంది.

ఆరోజు ఉదయం అతనికి టిఫిన్ పెడుతూ 'రాత్రివరకు మీకు కనిపించను, చీటికి మాటికి పిలవకండి' అంది.

"కానీ ఆదీ ! నిన్ను చూడకుండా ఉండలేకపోతున్నాను"

"ఇలాంటివాళ్లనే కక్కుర్తి రకం అంటారు" అంటూ టిఫిన్ ప్లేటు తీసుకుని లోనికి వెళ్లిపోయింది.

ఆమె వెళ్లిన దగ్గరమంచి ఆ పగలంతా హైదరాబాద్ తెలుగు టి. వి. ప్రసారాలు చూసినట్లు బాధగా గడిపేశాడు.

చీకటి పడింది.

అతనిలో పులకింతలు, గిలగింతలు పెట్ట సాగాయి.

చివరకు ఎలాగయితేనేం పదిన్నరకు పాల గ్లాసుతో గదిలోకి అడుగుపెట్టింది. ఆమె రాక గమనించి చెంగున మంచం దూకి తలుపులకు గడియ పెట్టాడు.

ఆదిలక్ష్మిని సమీపించి తన మొహాన్ని ఆమెకు దగ్గరగా రానిచ్చి తియ్యగా పిల్చాడు 'ఆదీ !' అని.

ఆమె కూడా తన మొహాన్ని ఇంకొంచెం ముందుకు చేర్చి పిల్చింది 'గోపీ' అని.

అంతే ! గోపాలంలో ఎక్కడలేని వేడి రాసాగింది. ఆ రాత్రి విశిష్టతను గూర్చి తన మిత్రులు చెప్పిన నీతి పాఠాలు గుర్తు చేసుకొని అతి లాఘవంగా ఆమె నడుము చుట్టూ తన చేతులు వెనక్కు పోనిచ్చి ఆమెను తన గుండెలకు గట్టిగా హత్తుకున్నాడు. ఆమె ఎత్తైన స్థనద్వయం స్పర్శకి పులకించిపోయాడు.

అయితే అంతవరకు మగ స్పర్శ ఎరుగని ఆమెకు ఆదోలా అనిపించినా తప్పదని ఊరుకుంది.

తర్వాత గోపాలం చొరవగా బ్లౌజ్ హుక్స్ మీదికి చేయి పోనిచ్చాడు.

ఆమె కొంచెం సిగ్గు, కొంచెం ఓవర్ ఆక్షన్ కలిపి వద్దన్నట్లు తలతిప్పింది.

ఆమె మాటలతో తనకు సంబంధం లేదన్నట్లుగా ఉన్నాడతగాడు. ఆమె సిగ్గుతో కళ్లు మూసుకుంది.

ఆ తర్వాత మిత్రుల నీతి పాఠాల ప్రకారం సదరు గోపాలం అతి లాఘవంగా ఆమె చీర కుచ్చెళ్లవేపు దాడి మొదలెట్టాడు.

అంతవరకు అతని కార్యక్రమం నిరభ్యంతరంగా జరిగింది. ఒకసారి గుండెలనిండా గాలి పీల్చుకున్నాడు భయం పోవటానికి. తర్వాత ఆమెను సమీపించాడు.

గదిలో చిన్న దీపం వెలుగుతోంది.

తన రెండు చేతులు ఆమె భుజాల మీద వేసి 'ఆదీ' అంటూ ఆమె మొఖంలోకి చూశాడు.

షాక్ ! షాక్ తగిలిందతనికి.

ఆ షాక్ నుంచి కోలుకోను పాపం గోపాలానికి ఐదు నిమిషాలు పట్టింది.

ఎదురుగా ఆదిలక్ష్మి భయంతో వణికిపోతోంది.

అది ఆ క్షణాన అతనికి తగిలిన షాక్.

"ఏమైంది?" ఆమెను సమీపిస్తూ అన్నాడు.

"ఇంకా కాలేదు. ఇక అవుతుంది. అందుకు"

"అయితే"

"అమ్మో ! ఇంకా ఏమన్నా ఉందా ! మా అమ్మ చంపేస్తుంది"

"ఎందుకు చంపేస్తుందేమిటి?"

"ఎందుకేమిటి? ఇలాంటి పనులు చేస్తే మా అమ్మ ఊరుకోదు."

"ఎలాంటి పన్లు"

"ఇదే ! ఇప్పుడు మీరు చేయబోలా అలాంటివి. ఒకసారి ఏమైందో తెలుసా ! నేను చిన్నపిల్లప్పుడు, మా బావి వుంది చూశారు దాని ప్రక్కనున్న గడ్డివాము చాటున నేను నా బోయ్‌ఫ్రెండ్ కల్సి "అది" చేయబోయాం. ఇంతలో మా అమ్మ చూసింది. అంతే చావబాదింది. ఇంకోసారి అలా చేస్తే చంపేస్తానని వార్నింగ్ ఇచ్చింది."

అంటే మొత్తంమీద చిన్నప్పటినుండి బాయ్‌ఫ్రెండ్‌ను మెయింటైన్ చేసిందన్న మాట అని మనసులో అనుకుని మళ్లీ ప్రశ్నించాడు.

"ఇంతకీ ఆ బోయ్ ఫ్రెండ్ ఎవరో?"

"అబ్బ సిగ్గండీ !"

"ఆ పని చేసినప్పుడు లేదా? సిగ్గట సిగ్గు?"

"లేదండి. అది చేస్తే ఎలావుంటుందో అన్న కుతూహలం కొద్దీ అలా చేశాం కాని తప్పని తెలీదండి"

"మరి నేను రుచి చూపించబోయేది అదేగా"

"అదే నేను వద్దంటున్నాను."


"ఎందుకని ?"

"చెప్పానుగదండి. అమ్మ ఊరుకోదని. మళ్లీ తంతుంది. నేను మీతో 'అది' చేయటానికి ఒప్పుకున్నానని తెలిస్తే" అంది తన మనస్సులో భావాలు బయటపడకుండా జాగ్రత్తపడుతూ.

ఆమె చెప్పేది నిజమో, లేక సరదాకి అలా చెప్పిందో ఆ క్షణాన అర్థం చేసుకోలేకపోయాడు గోపాలం.

ఇలాంటి విషయాల్లో మగవాళ్లే చొరవ తీసుకోవాలని నిశ్చయించుకొని ఇలా అన్నాడు.

"చూడు ఆదీ ! అప్పుడు నువ్వు చిన్నపిల్లవి. 'అది' అంటే ఏమిటో నీకు





తెలియదు. అలా చేయటం తప్పని నీకు తెలియదు. నలుగురికి తెలిస్తే నవ్వుతారు. అందుకే మీ అమ్మ నిన్ను చావబాదింది. పైగా ఆ వయస్సులో నీ శరీరావయవాలు అందుకు అనుకూలంగా వుండవు. అందుకే మీ అమ్మ అలా చేసింది. ఇప్పుడు నువ్వు యౌవ్వనంలో ఉన్నావు. ఇది అందుకు తగ్గ సమయమని మనల్ని ఒకటి చేయటానికే ఇలా ఒకే మంచమున్న ఈ గదిలోకి పంపారు."

"అది కాదండి. అప్పుడలా జరిగింది. చిన్నదాన్ని అని సరిపెట్టుకున్నాను. ఆ తర్వాత కూడా మా అమ్మ వార్నింగ్ ఇచ్చింది" అంది బేలగా.

"మళ్లీ ఏం చేశావు?"

"మళ్లీ అదే ! అమ్మ కొట్టినప్పటినుండీ ఆ కోరిక మరింత బలపడింది. ఇంతలో నేను పెద్దదాన్నయాను. ఏదో సినిమాలో సన్నివేశం గుర్తుచేసుకుని ఇంటివద్ద కుదరక మా సరుకుతోటలో కెళ్లాం" అని ఆపింది.

"వెళ్లి" అన్నాడు. ఆ క్షణాన అతని మొహం వాడిపోవటం ఆమె గమనించింది అని అతనికి తెలియదు.

"వెళ్లాక ఏంచేస్తాం? అతను మీలాగే వర్తి తొందర మనిషి. ఇలాగే వస్త్రాపహరణం చేశాడు. అయితే చివరి క్షణంలో మళ్లీ అనుకోకుండా పట్టుబడ్డాం" అంది.

"ఎలా ?"

"అదే పనిమీద అక్కడికి మరో జంట వచ్చింది"

"ఎవరు ?"

"మా మావయ్య" అంది చేతుల్తో మొహం కప్పుకుంటూ.

"ఇంతకీ ఆ కుర్రాడెవరు ?"

అతను మా తెలుగు మాస్టారబ్బాయి.

"ఇప్పుడేం చేస్తున్నాడో?"


"పెళ్లి తంతారా ఏమిటి?" అంది అనుమానంగా.

"మొత్తం మీద పెళ్లికి ముందు గ్రంథం నడపావు. అది సర్లేగాని ఆ తర్వాత ఏమైంది" అన్నాడు ఆసక్తిగా.

"ఏమైంది. అమ్మకు తెల్సింది. అట్ల కాడ కాల్చి వాతలు పెట్టింది. ఇంకోసారి కనుక ఇలా కనుక ఆ పని ఇతరులతో చేస్తే నామీద ఒట్టే అంది. అందుకే వద్దంటున్నాను గాని ఇష్టం లేక కాదండి" అంది అమాయకంగా ముఖం పెట్టి.

"అదిసర్లే. చెప్పుకుంటే నాకు అలాంటివి రెండు మూడు సంఘటలున్నాయి కాని, నామాట విను, మీ అమ్మ ఇతరుల్తో అంది గాని నాతో కాదుగా, రా. నామాట విను" అంటూ ఆమెను మీదకు లాక్కున్నాడు.

"అబ్బ వదలండి. మీకు మరీ అంత



ఇదిగా వుంటే చెప్పండి వెళ్లి అమ్మ నడిగి వస్తాను"

"ఏమని?" అన్నాడు ఆమె అమాయకత్వానికి నవ్వుకుంటూ.

"ఇంకేమని ? మీ అల్లుడుగారు 'అది' కావాలంటున్నారు. లేదా నిద్రపోరట. అక్కడికీ చెప్పాను. మీ అమ్మ ఊరుకోదని. అయినా ఆయన వింటల్లేదు. ఏంచెయ్యను ఒప్పుకోనా" అని అంది.

"ఛీ. సిగ్గు లేకపోతే సరి. ఇంత మొద్దు మొహాన్ని ఎక్కడా చూల్లేదు. అరె. ఎక్కడన్నా మొదటి రాత్రంటే మొగుడు ఎలా చెపితే అలా నడుచుకోమని చెప్పిపంపుతారు గాని ఇలా చెప్పి పంపరు. అయినా ఆదీ నేను నీకు తాళికట్టిన మొగుణ్ణి. ఎందుకు భయం చెప్పు"

"అంటే రెండు లక్షలు పుచ్చుకుని నాకు తాళికట్టింది ఇందుకేనా?"

"మరి" చిరాగ్గా చూసాడు.

"అలా అనినాకు తెలీదండీ. అయినా 'అది' అంటే మీకెందుకు అంత 'యిది' చెప్పండి" అంది అతని భుజం మీద గడ్డం ఆన్చుతూ.

"ఎందుకేమిటి పిల్లలు వద్దానీకు?"

"భలేచేప్తారండి మీరు. వట్టి అమాయకులండి. పిల్లలు పుట్టాలంటే 'అది' చేయాలా ఏంటి"

"చెయ్యకుండానే పుడతారా మహాతల్లీ! అవునులే రెండుసార్లు అనుభవం ఉన్నదానివిగా" అన్నాడు కసిగా.

"ఎందుకు పుట్టరు. సిన్మాల్లో చూడండి హీరో, హీరోయిన్‌లు గదిలోకెళ్లి ఇద్దరు కల్సి ముందు ఓ పాట పాడుకుంటారు. తర్వాత ఇద్దరుమంచం మీద ఒకరి ప్రక్కన ఒకరు పడుకుంటారు. అంతే! పిల్లలు పుడతారు."

"తెల్సింది బాబూ" బాగా తెల్సింది. ఈ దరిద్రపు తెలుగు సినిమాలు నా మొదటి రాత్రిని ఎలా ముంచాయో తెల్సింది. ఎదో ఎర్రగా బుర్రగా వున్నావని చేసుకున్నందుకు బాగా బుద్దొచ్చింది" అంటూ అటు తిరిగి పడుకున్నాడు.

అతని అలక చూసి ఆమెకు నవ్వొచ్చింది. బిగపట్టి అంది-

"అయితే ఈ స్వీట్లు ఏం చెయ్యమంటారు?"

"నువ్వే తిను. లేకపోతే కుడుతి తొట్లో పొయ్యి"

"సర్లెండి. నాకు ఫాన్ గాలి పడదు."

"కట్టెయ్! అంతకు చాలకపోతే మెయిన్ ఆపేయ్"

"ఎందుకండి అలా కోప్పడతారూ. సర్లెండి నేను క్రింద పడుకుంటున్నాను."

# అది అంటే ఇది

"అలాగే క్రింద కాకపోతే వెళ్లి సరుగుడు తోట్లో పడుకో" అన్నాడు ఉక్రోషంగా.


"అదికాదండి. మీరు పిల్లలు కావాలంటే మీ ప్రక్కన పడుకుంటాను. వద్దంటే క్రిందపడకుందామని అడిగాను. పోని మీరు లాగేసిన చీరన్నా కట్టుకోమంటారా లేక ఇలానే పడుకోమంటారా"

"ఆర్భాటపు మొగుడికి ఆయాసం ఎక్కువని ఊర్కే అనరు. కట్టుకో మహాతల్లీ. బాగా కట్టుకో. ఒక్క చీరేం ఖర్మ ఆ దుప్పటి, ఈ రగ్గు అన్ని చుట్టచుట్టి కట్టుకో" అని ముసుగు తన్ని పడుకున్నాడు.

"వినుగుమీదున్నారు. ఓపాట పాడమంటారా"

"ఏం.కనీసం నేను నిద్ర పోవటం కూడ నీకు యిష్టంలేదా."

"ఊహూ మీరు పోకూడదు. నేను పోకూడదు అని మా అమ్మ చెప్పిందండి నన్ను గదిలోకి పంపేముందు" అంది.



"ఇంకొకసారి గనుక 'అమ్మ' ఊసు ఎత్తావో చంపేస్తాను. అమ్మట. అమ్మ. ఛీ. ఛీ. ఎంత సిగ్గుచేటు. రేపు ఆఫీసులో డల్‌గా కనపడితే పెళ్లాన్ని లొంగదీసుకోలేని వెధవనంటారు. పెళ్ళయ్యి సుఖం లేదు. కాక సుఖంలేదు. కనీసం ముద్దుపెట్టుకుందామన్నా అమ్మో, చప్పుడు విని అమ్మ గదిలోకి వస్తుందంటావు" అని దుప్పటి పూర్తిగా ముసుగుతన్నాడు.

అంతవరకు ఆపుకున్న నవ్వుని ఇక ఆపుకోలేక నవ్వుకుంటు వెళ్లి ఫేన్ స్పీడ్ పెంచి గోపాలం వద్దకు వెళ్లి గాజులు చప్పుడయ్యేలా చేతులు కదిపింది.

గోపాలం కదల్లేదు.

"ఏమండి" గోముగా పిల్చింది.

"నేను మాట్లాడను" అన్నాడు గోపాలం.

"అబ్బా. లేవండి పెద్ద అలక సాగించారు." అంటు దుప్పటి లాగేసి చటుకున ముద్దుపెట్టుకుంది.

గోపాలానికి ముందు అర్థం కాలేదు. అర్థం అయ్యాక బిత్తరపోయాడు.

"ఏమిటండి అలా అయిపోయారు. నేను ఏదో సరదాకి అలా చెపితే, దానికీ ఇలా అయిపోతే ఎలా?" అంది మురిపెంగా.

"కాని"

"నాకు తెల్సండి. మీరు మరీ సెన్సిటివ్. దీన్ని తట్టుకోలేరు. ఆ విషయం నాకు తెల్సు. ఇందులో మీతప్పేమి లేదు. అజ్ఞానం. అంతే. మీరు మీసొంత అభిప్రాయాల కన్నా ఇతరుల చెప్పిందానికి విలువ యిస్తారు. అది ఎలా దెబ్బతీస్తుందో చెప్పాలనే నేను నాటకమాడాను."

"ఆది !"

"అవునండి. మీకు వయసుంది. ఉద్యోగం ఉంది. కాని భార్యతో ఎలా మసులుకోవాలో తెలీదు. ఏదో ఊహించుకొనడం తప్ప. ఈ రాత్రి విశేషం తెలియక మీరు ఇంగ్లీషు సినిమాలు చూసిన అనుభవంతో తొందర పడబోతుంటే ఆపాను. చూడండి మొదటి రాత్రంటే జీవితాంతం గుర్తుండేలా గడపాలి. అంతేకాని ఆదరాబదరా చెయ్యకూడదంటారు. భార్య, భర్తను అభిమానించేది ఆరాధించేది ఈ తృప్తి లభించినపుడే. దాన్ని అందరిలా మీరు చప్పబరుస్తుంటే అలా కథలు చెప్పాను. ఇది తప్పైతే మన్నించండి" అంది అతని ప్రక్కన కూర్చుంటు.

"ఆదీ. ఎంత బాగా ఆలోచించావు. నిజానికి ఈ ఆలోచన నాకు వచ్చి ఉండాల్సింది. నాకు ఏమి తెలియదు అని నా మిత్రుల సహాయం కోరాను. కాని ఆ కో[illegible] ముందు నా భార్యకు ఏమి తెలీదు అన్న సత్యాన్ని గుర్తించలేకపోయాను. కారణం మగవాణ్ణి అన్న అహంకారం. ఆడవాళ్లకేం తెలుసు అన్న చులకన భావం. కాని నిజం చెపుతున్నాను నువ్వు నాభార్య కావటం నా అదృష్టం" అన్నాడు.

"అమ్మయ్య మొత్తానికి దారికొచ్చారు. ఇక ఈ సంగతి మర్చిపోయి కార్యక్రమం ప్రారంభించుదామా" అంది అతని మెడమీద చేతులు వేస్తూ.

"అడ్డుగోడలు పోయాక ఆలస్యంఎందుకు" అంటూ మీదకు లాక్కున్నాడు.

"అమ్మో ! మరీ అంతగట్టిగానా"

"మూడ్ వచ్చింది. వస్తే తట్టుకోవటం కష్టం"

"చాల్లే బడాయ్" అంటూంటే "మాట్లాడకు. నీనోరు ఎలా మూయించాలో నాకు తెల్సు" అన్నాడు.

"ఎలా" అంది అరమోడ్పు కన్నులతో.

"ఇదిగో ఇలా" అంటూ తన పెదవులతో ఆమె పెదవుల్ని మూసాడు.

(తర్వాత సీన్ సెన్సార్ కట్!)

-ఎడిటర్]